క్లుప్తంగా

బాధ్యతలు చేపట్టిన సీఐ


సీఐ సూర్యనారాయణ

బి.కొత్తకోట: స్థానిక పోలీస్‌స్టేషన్ సీఐగా ఎస్.సూర్యనారాయణ శుక్రవారం బాధ్యతలను చేపట్టారు. ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహిస్తున్న ట్రైనీ డీఎస్పీ ప్రశాంత్ నుంచి ఆయన బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని, ప్రజలు కూడా సహకరించాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

గుర్రంకొండ ఎస్‌ఐగా నాగార్జునరెడ్డి



గుర్రంకొండ: గుర్రంకొండ ఎస్‌ఐగా నాగార్జునరెడ్డి బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఎస్‌ఐగా పనిచేస్తున్న దిలీప్‌కుమార్ పీలేరుకు బదిలీ అయ్యారు. కర్నూలులో ఎస్‌ఐగా పనిచేస్తున్న నాగార్జున రెడ్డి బదిలీపై శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఇందుకోసం అందరూ సహకరించాలన్నారు.

సారా విక్రేత అరెస్ట్

నిమ్మనపల్లె : అక్రమంగా సారావిక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ లోకేష్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీ, ఎర్రతివారిపల్లె సమీపంలో సారా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేశారు. వాల్మీకిపురం మండలం చింతపర్తి గ్రామం మేకలవారిపల్లెకు చెందిన మేకల చిన్న రెడ్డెప్ప (33)ను అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని వద్ద నుంచి 15 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

మద్యం విక్రేత అరెస్టు

బి.కొత్తకోట: కర్ణాటక మద్యం విక్రయిస్తున్న టైలర్‌ను అరెస్ట్ చేసినట్టు ఎస్‌హెచ్‌ఓ ప్రశాంత తెలిపారు. స్థానిక దిగువబస్టాండ్‌లో టైలర్ షాపు నడుపుకొంటున్న పి.వెంకటరమణమ్మ (26) కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్టు అందిన సమాచారంపై దాడులు నిర్వహించారు. పోలీసులను చూసి మద్యం బాటిళ్లు విసిరేసి పరార య్యేందుకు ప్రయత్నించగా అదుపులోకి తీసుకొని విచారించామని తెలిపారు. 10 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రేపు జిల్లా టీ-20 క్రికెట్ జట్టు ఎంపిక

పీలేరు రూరల్ : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం జిల్లా టీ-20 క్రికెట్ జట్టు ఎంపిక చేయనున్నట్లు టీ-20 క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి కె. అద్వైత్ ఓ ప్రకటనలో తెలిపారు. టీ-20 క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేస్తున్నట్లు పేర్కొన్నారు. అండర్ -19, సీనియర్స్ విభాగాల్లో జిల్లా జట్లను ఎంపిక చేస్తామని తెలిపారు. వివరాలకు 8374543595 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నేడు కేవీపల్లె, పీలేరులో కార్యకర్తల సమావేశం

పీలేరు రూరల్ : కేవీపల్లె, పీలేరులో శనివారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్లు వెంకటరమణారెడ్డి, దండు జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఉదయం 9.30 గంటలకు కేవీపల్లె మండలంలోని వగళ్లలోని కరీమ కల్యాణ మండపంలో కేవీపల్లె మండల కార్యకర్తలతో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సమావేశం అవుతారని చెప్పారు. మధ్యాహ్నం 3 గంటలకు పీలేరు పట్టణం వీఎస్‌ఆర్ కల్యాణ మండపంలో పీలేరు మండల కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో విద్యార్థుల ఎంపిక

మదనపల్లె సిటీ: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో శుక్రవారం శ్రీరామ్ కంపెనీ క్యాంపస్ ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఇందులో 20 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఏడుగురు ఎంపికయ్యారు. వీరికి నెలకు రూ.12 వేలు నుంచి రూ.20 వేలు జీతం అందజేస్తారని ప్రిన్సిపాల్ కృష్ణవేణి తెలిపారు.

మెరిట్ స్పోర్ట్స్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక


విష్ణుప్రియకు చెక్కు అందజేస్తున్న ప్రిన్సిపల్ కృష్ణవేణి

మదనపల్లె సిటీ: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ బీకాం ఫైనల్ ఇయర్ విద్యార్థి విష్ణుప్రియ ఎస్వీ యూనివర్సిటీ స్పోర్ట్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైంది. గత రెండు సంవత్సరాలలో అంతర విశ్వవిద్యాలయాల ఖోఖో క్రీడా పోటీల్లో ఎస్వీ యూనివర్సిటీ తరఫున పాల్గొనేందుకు స్పోర్ట్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికై ంది. శుక్రవారం కాలేజీలో ప్రిన్సిపల్ డాక్టర్ కృష్ణవేణి రూ.6 వేలు చెక్కును విద్యార్థిని విష్ణుప్రియకు అందజేశారు.

జగనన్న పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ లబ్ధి

– పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


కలికిరి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల

కలకడ : ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్ధిని ప్రతి ఇంటికీ వివరించి ఓటు కోరే హక్కు వైఎస్సార్ సీపీకి ఉందని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం కలకడలో వైఎస్సార్ సీపీ మండల స్థాయి కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి ప్రసంగించారు. విద్యలో కేరళను మించి ఆంధ్రప్రదేశ్ ముందు స్థానంలో నిలచిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా 96 శాతం పూర్తి చేశారన్నారు. అసత్యపు హామీలతో టీడీపీ ప్రజలను మభ్యపెట్టాలని చూస్తోంది. టీడీపీ అధికారంలోకి వస్తే వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ రద్దు తోపాటు, ఆర్‌బీకేలు , అమ్మఒడి, సంక్షేమ పథకాలు నిర్వీర్యం అవుతాయన్నారు. ఈనెల 11వ తేదిన అనంతపురంలో నిర్వహించే 'సిద్ధం' ప్రచార సభకు మద్దతుగా మండలంలో ఒక్కరోజు బైక్‌ర్యాలీ నిర్వహించాలని కార్యకర్తలకు దిశనిర్దేశం చేశారు. అందరు ఐక్యతతో పనిచేయాలని నియోజకవర్గ పరిశీలకులు సహదేవరెడ్డి కోరారు. కార్యక్రమంలో ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రవికుమార్‌రెడ్డి, ఎంపీపీ శ్రీదేవి, కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, సింగల్‌విండో అధ్యక్షుడు వెంకట్రమణరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఈశ్వర్ నాయుడు, కోఆప్షన్ సభ్యులు ఇనాయతుల్లా, ప్రత్యేక ఆహ్వానితులు సరళ, జివి కిషోర్, ఎంపీటీసీ సభ్యులు డాక్టర్ పురుషోత్తంనాయుడు, క్రిష్టారెడ్డి, ముబారక్, సర్పంచ్‌లు శాంతమ్మ, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

కలిసి కట్టుగా విజయానికి కృషి చేయాలి

కలికిరి: వచ్చే ఎన్నికలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు కలిసి కట్టుగా పార్టీ విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఈ నెల 11న అనంతపురంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగనున్న సిద్ధం కార్యక్రమానికి సమాయత్తంలో భాగంగా శుక్రవారం కలికిరిలో వైఎస్సార్‌సీపీ మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశనికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలకు సమయం సమీపిస్తున్నందున ప్రతి కార్యకర్త, నాయకుడు ఏలాంటి భేషజాలకు తావులేకుండా కష్టపడి పనిచేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కుల, మత, రాజకీయాలతీతంగా ప్రతి ఇంటికి, కుటుంబానికి కనీసం రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు నేరుగా లబ్ధి చేకూరిందన్నారు. ప్రతి కుటుంబం నుంచి ప్రజలు సమావేశానికి తరలి వచ్చేలా కార్యకర్తలు సమన్వయపరచుకోవాలన్నారు.

టీడీపీవి ప్రగల్భాలు మాత్రమే..

టీడీపీ ప్రగల్భాలు అధికమయ్యాయని, గతంలో 14 సం.లు ముఖ్యమంత్రిగా పని చేసిన మాజీ సీఎం చంద్రబాబు ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. కేవలం సీఎం జగన్ మోహన్ రెడ్డిని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. ఇటీవల పీలేరులో జరిగిన సమావేశంలో టీడీపీ నాయకులు వారు గెలిస్తే చేసే పథకాలను వివరించాల్సింది పోయి.. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులను టార్గెట్ చేస్తూ ప్రసంగాలు చేయడం దారుణమన్నారు. ఇది ప్రజల పట్ల వారికున్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో రాష్ట్రమైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, ఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ తిమ్మారెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకులు సహదేవరెడ్డి, ఎంపీపీ నూర్జహాన్, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, మండల కన్వీనర్ రమేష్ కుమార్‌రెడ్డి, సర్పంచ్‌లు వెంకటరెడ్డి, గంగయ్య, అరుణబాబురెడ్డి, తస్లీమారియా జుద్దీన్, వైస్ ఎంపీపీ శ్రీకాంత్, మండల ప్రత్యేక ఆహ్వానితులు రత్నశేఖర్‌రెడ్డి, శివాజీ, మండల కో-ఆప్షన్ సభ్యుడు రిజ్వానుల్లా పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

కలకడ : మండలంలోని కె.దొడ్డిపల్లె పంచాయతీ గోపాలపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ కార్యకర్త గుర్రప్ప కుమారుడు మృతిచెందినట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే చింతల.రామచంద్రారెడ్డి వారి ఇంటికి వెళ్లి గురుపాల్‌తేజ చిత్రపటం వద్ద నివాళి అర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే ద్విచక్రవాహం అదుపుతప్పి గాయపడిన వైఎస్సార్‌సీపీ నాయకులు తుల్లూరు నాగరాజ అతని భార్య లక్ష్మిని పరామర్శించారు.

ఎమ్మెల్యే నివాళి

వాల్మీకిపురం: పట్టణంలోని జట్టిపాల్యెంవీధికి చెందిన పద్మావతమ్మ గుండె పోటుతో మృతి చెందింది. శుక్రవారం ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాడ సానుభూతి తెలిపారు.

షాదీమహల్ నిర్మాణాన్ని పూర్తిచేస్తాం

– నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్


ఇందిరానగర్ షాదీమహల్ పనులు పరిశీలనకు వచ్చిన సమన్వయకర్త నిసార్‌అహ్మద్

మదనపల్లె : పట్టణంలోని ఇందిరానగర్‌లో పాతికేళ్లుగా ప్రారంభానికి నోచుకోని షాదీమహల్ నిర్మాణాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పూర్తిచేసి, ముస్లిం మైనారిటీల కల నెరవేరుస్తానని నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. శుక్రవారం ముస్లిం జమాత్, మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు జింకాచలపతి, నూర్‌ఆజంలతో కలిసి ఆయన ఇందిరానగర్ షాదీమహల్‌ను పరిశీలించారు. వాటర్ సప్లై, టాయిలెట్స్, రూఫింగ్, పెయింటింగ్, ఎలక్ట్రిక్ వర్క్స్ పెండింగ్ ఉండటంతో పంచాయతీరాజ్ డీఈ శివప్రసాద్‌ను పిలిపించి, అసంపూర్తి పనులపై ఎస్టిమేట్లు వేయాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 1997లో మంజూరైన షాదీమహల్‌ను 2000లో పనులు ప్రారంభించి, వివిధ కారణాలతో నిర్మాణపనులు వాయిదా వేయడం జరిగిందన్నారు. అప్పటి నుంచి ప్రభుత్వాలు మారినా షాదీమహల్ పనులు మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందాన ఉండేదన్నారు. టీడీపీ ప్రభుత్వంలో షాదీమహల్ నిర్మాణానికి రూ.12.50లక్షలతో పనులు ప్రారంభించి, తర్వాత దాన్ని అటకెక్కిస్తే... 2014లో ఎంపీ మిథున్‌రెడ్డి రూ.20లక్షలు మంజూరుచేశారన్నారు. అయినప్పటికీ అప్పటి టీడీపీ ప్రభుత్వం పూర్తిచేసేందుకు చొరవచూపలేదన్నారు. తర్వాత వివిధ కారణాలతో పనులు వాయిదాపడ్డాయని, ప్రస్తుతం పనుల పూర్తికి పంచాయతీరాజ్ అధికారులు రూ.35లక్షల వరకు ఖర్చవుతుందని అంచనా వేశారని, ఎస్టిమేట్లను ఎంపీ మిథున్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి తదితరులతో చర్చించి, అతి త్వరలో పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే మదనపల్లె నియోజకవర్గంలో అసంపూర్తిగా, పనులు నిలిచిపోయిన హిందూ దేవాలయాలు, కమ్యూనిటీ భవనాలను తన దృష్టికి తెస్తే, వాటికి ఎస్టిమేట్లు వేయించి, ఎంపీ మిథున్‌రెడ్డి సహకారంతో పూర్తిచేసేందుకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ ఎస్.ఎ.కరీముల్లా, కౌన్సిలర్లు బి.ఎ.ఖాజా, కరీముల్లా, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, గుండ్లూరురఫీ, లియాఖత్‌అలీ, మాజీ కౌన్సిలర్ రఫీ, మెట్రోబాబ్‌జాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు అండగా నిలుస్తాం

మదనపల్లె సిటీ: ఆర్యవైశ్యులకు అండగా నిలుస్తామని మదనపల్లె నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక వాసవీభవన్‌వీధిలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆర్యవైశ్యులతో సమావేశం నిర్వహించారు. నిసార్ అహ్మద్ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సమస్యలు తమ దృష్టి తెస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆర్యవైశ్యుల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆర్యవైశ్యులు తనకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. ఆలయ కమిటీ నిసార్‌అహ్మద్‌కు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చైర్మన్ మనూజారెడ్డి, వైస్ చైర్మన్ జింకా చలపతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి గార్ల చంద్రమౌళి, ఆర్య వైశ్య సంఘ అధ్యక్షులు ఓంప్రకాష్, పసుపు రవి, దేవతా సతీష్, కౌన్సిలర్లు రాజేష్, ఖాజా, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. లక్ష్మీనరసింహుడి కల్యాణం


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి కల్యాణాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో చలువపందిళ్లు, పచ్చని తోరణాలతో పెళ్లివేదికను అందంగా అలంకరించారు. ముందుగా మూలవర్లకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి పాలతో క్షీరాభిషేకం చేశారు. వేదపండితులు మంత్రోచ్ఛారణల మధ్య మేళతాళాలతో శాస్త్రోక్తంగా మాంగల్య ధారణ కావించారు. కల్యాణోత్సవం సందర్భంగా స్వామివారి ఎదుట యజ్ఞహోమాలు నిర్వహించారు. రూ.300 చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు టీటీడీ వారు పట్టువస్త్రాలు, కంకణాలు, స్వామివారి ప్రసాదాలు అందజేశారు. పెద్ద ఎత్తున భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొని స్వామివారిని సేవించుకొన్నారు.

హైదరాబాద్‌కు మరో బస్సు సర్వీసు

మదనపల్లె సిటీ: మదనపల్లె వన్ డిపో నుంచి హైదరాబాద్‌కు మరో బస్సు సర్వీసును శుక్రవారం ప్రాంభించారు. మదనపల్లె నుంచి బీహెచ్‌ఈఎల్‌కు ప్రతి రోజు రాత్రి 8.45 గంటలకు బయలు దేరుతుందని డీఎం మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. మరుసటి రోజుఉదయం 8 గంటలకు బీహెచ్‌ఈఎల్‌కు చేరుకుంటుందన్నారు. ప్రతి రోజు బీహెచ్‌ఈఎల్ నుంచి సాయంత్రం 4.45 గంటలకు బయలుదేరుతుందన్నారు. ఎంజీబీఎస్‌లో రాత్రి 7గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు మదనపల్లెకు చేరుకుంటుందన్నారు. సూపర్ లగ్జరీ బస్సు సర్వీసును ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు వైఎస్సార్‌సీపీ బైక్ ర్యాలీ

రామసముద్రం: మండలంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్, మాజీ ఎమ్మెల్యే దేశాయి తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డిలు శనివారం నిర్వహించే బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం రామసముద్రంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

రోడ్డు భద్రత.. ప్రతి ఒక్కరి బాధ్యత


అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంవీఐ శివలింగయ్య

మదనపల్లె : రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంవీఐ శివలింగయ్య అన్నారు. 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో శుక్రవారం పట్టణంలోని స్థానిక జెడ్పీహైస్కూల్‌లో రహదారి భద్రతా నిబంధనలపై అవగాహన ర్యాలీని ప్రారంభించారు. హెల్మెట్లు ధరించి ద్విచక్రవాహనాలపై ప్రయాణిస్తూ, రహదారి భద్రతకు సంబంధించిన స్లోగన్స్ ఇస్తూ... అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంవీఐ శివలింగయ్య మాట్లాడుతూ... రహదారులపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రోడ్ సేఫ్టీ గురించి ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తెలుసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. దేశంలో ప్రతి నిమిషానికి ఒక రోడ్డు ప్రమాదం జరుగుతుండగా, ప్రతి మూడునిమిషాలకు ఒకరు చొప్పున ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నారని తెలిపారు. ఎక్కువశాతం అధికవేగంతో రోడ్లపై వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం జరుగుతోందన్నారు. రోడ్డుపై వాహనాలను నడిపే ప్రతి వ్యక్తి రూల్స్‌ను పాటించి, ఇతరులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తగా వాహనాలు నడిపితే... ప్రమాదాలు జరిగేందుకు అవకాశమే లేదన్నారు. రహదారి ప్రమాదాల నివారణ కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. యువకులు ప్రమాదాల బారిన పడి నిండుప్రాణాలు పోగొట్టుకోవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ వలీబాషు, ఆర్టీఏ సిబ్బంది పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులతో ఉద్యోగ అవకాశాలు

కేవీపల్లె : వృత్తి విద్యా కోర్సులతో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని వగళ్ల కస్తూర్బాగాంధీ గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ శ్రావణి అన్నారు. శుక్రవారం వగళ్ల కేజీబీవీ విద్యార్థులు పీలేరులోని ఓ వెల్నెస్ సెంటర్, బ్యూటీ పార్లర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృత్తి విద్యలో టెక్నాలజీ ఏ విధంగా ఉపయోగిస్తారు, వాటి ప్రయోజనాలు విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వృత్తివిద్య శిక్షకులు పద్మలత, రూప, ఉపాధ్యాయినులు విజయకుమారి, ఈశ్వరమ్మ, నస్రూన్, అన్నపూర్ణ, విద్యార్థినులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యం

వాల్మీకిపురం: పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారని సర్పంచ్ గంగులమ్మ, ఉపసర్పంచ్ కేశవ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సచివాలయం 4 (ఓబులంపల్లి) పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో నిపుణులైన వైద్యులచే పరీక్షలు నిర్వహించి,అవసరమైన వారికి ఉన్నత వైద్యం అందించడం జరుగుతుందన్నారు. వేల రూపాయలు ఖర్చు చేసినా అందని వైద్యాని రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో అందిస్తుందన్నారు. ప్రజలు ఈ వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడివో షబ్బీర్ అహ్మద్, ఈవో రెడ్డి ప్రసాద్ రెడ్డి, నాయకులు చింతల ఆనంద రెడ్డి, నీళ్ళభాస్కర్, శ్రీధర్‌రాయల్, మహబూబ్‌బాషా, శ్రీనివాసులు శెట్టి, మదనమోహన్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కలికిరి: ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. మడలంలోని మర్రికుంటపల్లిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడుతూ కార్పొరేట్ స్థాయి వైద్య పరీక్షలు వైద్యశిబిరంలో ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా ఉన్నత స్థాయి వైద్యం అందివ్వడం జరుగుతుందన్నారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరంలో 298 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. నలుగురిని ఉన్నత వైద్యం కోసం రెఫర్ చేశారు. మేడికుర్తి పీహెచ్‌సీ వైద్యాధికారులు చిన్న రెడ్డెప్ప, కావ్యగంధ, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

కేవీపల్లె : జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరంలాంటిదని ఎంపీడీఓ ఉపేంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తీతవగుంటపల్లెలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలు వైద్యం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా గ్రామంలోనే మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్లు హరీషనాయక్, హరినాథ్‌రెడ్డి పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మఠంపల్లె, తీతవగుంటపల్లె సర్పంచ్‌లు రాజన్న, వీరకుమార్, ఏఎన్ఎంలు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో మెరుగైన వైద్యం

తంబళ్లపల్లె: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంతో గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. శుక్రవారం పరపతోపు పంచాయతీ గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్లు ఆశాలత, తేజశ్వి, వంశీధర్‌రెడ్డిలు 303 మందికి వైద్యచికిత్సలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ ఏవో ఆనంద్‌కుమార్, వైద్య శిబ్బంది పాల్గొన్నారు.

కలకడ సీఐగా డి.శ్రీనివాసులు



కలకడ : కలకడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా డి.శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సీఐగా పనిచేస్తున్న పి.నాగేంద్రను బదిలీపై రాయచోటి దిశ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. అనంతపురం జిల్లా పెద్దపడుగూరులో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న డి.శ్రీనివాసులు సీగా పదోన్నతిపై కలకడకు బదిలీపై వచ్చారు. సీఐ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణ, రౌడీషీటర్ల కదలికలపై నిఘా, రోడ్డు ప్రమదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానన్నారు.

మద్యం తరలిస్తున్న కారు పట్టివేత

బి.కొత్తకోట: కర్ణాటక నుంచి కారులో అక్రమంగా మద్యం తరలిస్తుండగా దాడులు నిర్వహించినట్టు ఎస్‌హెచ్‌ఓ ప్రశాంత్ శుక్రవారం తెలిపారు. బి.కొత్తకోట సమీపంలోని బద్దిపల్లె వద్ద అక్రమమద్యం తరలింపుపై దాడులు నిర్వహించామని తెలిపారు. దాడుల్లో చిత్తూరుజిల్లా చౌడేపల్లె మండలం కురవపల్లెకు చెందిన కే.నాగభూషణం (30), దేవిరెడ్డిపల్లెకు చెందిన యల్లప్ప, బి.కొత్తకోట మండలం బడికాయలపల్లెకు చెందిన ఎం.శివశంకర్ (47)లను అరెస్ట్ చేసి కారులో ఉంచిన 6.1 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసు నమోదు చేసి కారును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

ఏపీఎండీసీ చైర్‌పర్సన్‌గా షమీమ్‌అస్లాం



మదనపల్లె : ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఎండీసీ) చైర్‌పర్సన్‌గా మదనపల్లెకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకురాలు గుండ్లూరు షమీమ్‌అస్లాంను కొనసాగిస్తూ రాష్ట్రప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేసింది. 2021 ఆగస్టు 2న మొదటిసారిగా ఏపీఎండీసీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన షమీమ్‌అస్లాం రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగారు. 2 ఏళ్ల పదవీకాలం ముగియడంతో... తదుపరి ఉత్తర్వులు వచ్చేంతవరకు షమీమ్‌అస్లాంను ఏపీఎండీసీ చైర్‌పర్సన్‌గా కొనసాగించాలని గనుల ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది శుక్రవారం ఉత్తర్వులను ఇచ్చారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి విధేయురాలిగా ఉంటూ, పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలన్నింటిలోనూ షమీమ్‌అస్లాం క్రియాశీలకంగా పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, 2018లో కడపజిల్లా మహిళా కోఆర్డినేటర్‌గా పార్టీకి సేవలందించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి కుటుంబానికి అత్యంత సన్నిహితురాలిగా ప్రత్యేక గుర్తింపు పొందారు. రెండోసారి ఏపీఎండీసీ చైర్‌పర్సన్‌గా అవకాశం వచ్చిన సందర్భంగా షమీమ్‌అస్లాం మీడియాతో మాట్లాడుతూ.. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పార్లమెంట్ సభ్యులు మిథున్‌రెడ్డిల సహాయసహకారాలతో తన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించానన్నారు. రాష్ట్రంలోని అపారమైన ఖనిజవనరులను సద్వినియోగంలోకి తీసుకువచ్చి, పారిశ్రామిక అభివృద్ధికి చేయూతను అందిస్తూ, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.

నూతన పద్ధతిలో బోధన చేయాలి


గణిత ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

పీలేరు : విద్యార్థులకు నూతన పద్ధతిలో బోధన చేయాలని ఎంఈఓ లోకేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణితం, ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు ఐసీటీ సైన్స్ సిములేషన్స్‌పై శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు, కలికిరి, కలకడ, కేవీపల్లె మండలాల్లోని ఉపాధ్యాయులకు శుక్రవారం గణితంపై శిక్షణ ఇచ్చామని, శనివారం ఫిజికల్ సైన్స్, సోమవారం బయలాజికల్ సైన్స్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్‌గా నటరాజన్, రిసోర్స్ పర్సన్‌లుగా విజయలక్ష్మీ, రాధ, హేమలత, రెడ్డెమ్మ, సర్ఫుద్దీన్, పి.వి. రమణ వ్యవహరించారు.

తిరుపతికి వెళ్లి పింఛన్ అందజేత


కలికిరి : తిరుపతిలో వృద్ధురాలుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మంజూర్ వల్లి

కలికిరి: కలికిరి పట్టణం ఇందిరమ్మకాలనికి చెందిన వృద్ధురాలు అనారోగ్యంతో తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెకు దివ్యాంగ పింఛను నగదు రూ. 3వేలను శుక్రవారం స్థానిక వలంటీరు మంజూర్ వల్లి తిరుపతికి వెళ్లి అందజేశాడు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఆమెకు మానవతాదృక్పదంతో పింఛన్ అందజేసిన వలంటీర్ సేవను స్థానికులు అభినందిస్తున్నారు.

95 శాతం పెన్షన్లు పంపిణీ

పీలేరు : మండలంలో 95 శాతం మందికి వైఎస్సార్ పెన్షన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ మురళీమోహన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 9,989 పెన్షన్ లబ్ధిదారులు ఉన్నారని తెలిపారు. రెండు రోజుల్లోనే రూ. 2.92 కోట్లు పంపిణీ చేసి 95 శాతం పూర్తి చేసినట్లు చెప్పారు. ఒకట్రెండు రోజుల్లో వందశాతం పూర్తి చేస్తామని తెలిపారు.

కిడ్నీ వ్యాధి బాధితుడికి రూ.10వేల పింఛను

కలికిరి: మండలంలోని పల్లవోలు గ్రామం గడికి చెందిన రాజాసాబ్ ఇటీవల కిడ్నీ వ్యాధితో డయాలసిస్ చేయించుకుంటున్నాడు. స్థానిక వలంటీరు ద్వారా ఫించనుకు దరఖాస్తు చేసుకున్నాడు. ప్రభుత్వం అతనికి రూ.10వేల ఫించను మంజూరు చేసింది. ఈ మేరకు శుక్రవారం బాధితునికి స్థానిక సర్పంచ్ బీబీఆయేషా ఇస్తియాక్ చేతుల మీదుగా రూ.10వేలు ఫించను నగదు అందజేశారు. తనను ఆదుకున్న ప్రభుత్వానికి రుణపడి ఉంటానని బాధితుడు ఆనందం వ్యక్తం చేశాడు.

సేవా గుణం అలవర్చుకోవాలి

మదనపల్లె సిటీ: ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవర్చుకోవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్ అన్నారు. శుక్రవారం స్థానిక వారపుసంతలో కెజె మండి యజమాని ఎస్.దాదాపీర్ ఆధ్వర్యంలో టీటీడీ అన్నదాన సత్రానికి ఉచితంగా నాలుగు టన్నుల కూరగాయల వాహనాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా దాదాపీర్ టీటీడీ అన్నదాన సత్రానికి ఉచితంగా కూరగాయలు పంపడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ ఇలాంటి కార్యక్రమంలో పాలు పంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మనూజరెడ్డి, వైస్ చైర్మన్ జింకా వెంకటాచలపతి,కురవంక సర్పంచు చలపతి, వైఎస్సార్ సీపీ నాయకులు సలీం, సాయిశేఖర్‌రెడ్డి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

తంబళ్లపల్లె: మండల తహసీల్దార్ శ్రీనివాసులు బదిలీపై వెళ్తున్న సందర్భంగా అధికారులు, సిబ్బంది సన్మానించారు. డీటీ మౌలాలి తహసీల్దార్లను శాలువతో సత్కరించారు. రెవెన్యూ ఉద్యోగులు ఆయనకు వీడ్కోలు పలికారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా డీటీ మౌలాలి బాధ్యతలు స్వీకరించారు.

ఇన్‌చార్జి తహసీల్దారుగా డీటీ నవీన్

కురబలకోట: కురబలకోట తహసీల్దారు ఎం. భీమేశ్వరరావు ఎన్నికల బదిలీలలో భాగంగా వైఎస్సార్ కడప జిల్లా సింహాంద్రిపురం మండలానికి బదిలీ అయ్యారు. ఆయన శుక్రవారం అక్కడ బాధ్యతలు చేపట్టారు. కురబలకోటకు కొత్త తహసీల్దారు వచ్చేవరకు ఇన్‌చార్జి తహసీల్దారుగా డీటీ నవీన్ వ్యవహరిస్తారని ఉన్నతాధికారులు తెలిపారు.